క్లుప్తంగా

అందుబాటులోకి మెరుగైన వైద్యసేవలు



బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కొనసాగుతోంది. బొల్లాపల్లి పీహెచ్‌సీ పరిధిలో రేమిడిచర్ల, గుమ్మనంపాడు, వెల్లటూరు పీహెచ్‌సీ పరిధిలో పేరూరుపాడు, గుట్లపల్లి గ్రామసచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరుగుతుందని ఈ మేరకు వైద్యులు వినూత్న, కృష్ణానాయక్‌లు తెలిపారు. ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తేవడమే ఈ పథకం ఉద్దేశ్యమన్నారు. అక్టోబరు నుంచి గ్రామ సచివాలయ పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందజేస్తామన్నారు.

భరతనాట్య సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



వినుకొండ(నూజెండ్ల): బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, లిటిల్ చామ్స్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 1వ తేదీన వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి భరతనాట్య సమ్మేళనం పోస్టర్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ భరతనాట్య సమ్మేళనం నిర్వహించడం చాలా మంచి సంప్రదాయమని కొనియాడారు. సమాజంలో విశిష్టసేవ చేస్తున్న వారిని గుర్తించి వారికి జాతీయ గురుబ్రహ్మ, జాతీయ సేవకులు సేవా పురస్కారం అందజేయడం సంతోషకరమన్నారు. పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల వెంకట రామిరెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ ఎంఎ స్కే బాషా, ఉపాధ్యాయులు హెచ్.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పాస్టర్ మృతి



ఏసోబు (ఫైల్)

నాదెండ్ల: గణపవరం రాజీవ్ గాంధీ కాలనీలో నివాసం ఉండే గద్ద ఏసోబు (67) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. కొంత కాలంగా కాలనీలోని 9వ లైనులో నివాసం ఉండే ఏసోబు కల్వరి ప్రార్ధనా మందిరంలో పాస్టర్‌గా పని చేస్తున్నాడు. అయితే పది రోజులుగా అనారోగ్యం కారణంగా బంధువులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. రెండు పర్యాయాలు గుండెపోటు రావటంతో ఆయనకు ఆపరేషన్ నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో మరోసారి గుండెపోటు వచ్చింది. వైద్యులు చికిత్స చేస్తుండగానే మృతి చెందాడు. మృతుడికి భార్య కృపమ్మ ఇరువురు కుమార్తెలు. సమాచారం తెలుసుకున్న వివిధ ప్రాంతాల పాస్టర్లు గణపవరం చేరుకుని మృతదేహానికి నివాళి అర్పించారు.

డాక్టర్ సుధాకర్‌కు జాషువా పురస్కారం



నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేస్తున్న డాక్టర్ కాకాని సుధాకర్ జాషువా సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాషా సంఘం నిర్వహించిన విశ్వకవి గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.వి జయకుమార్, వైస్ చాన్స్‌లర్ ఆచార్య పట్టేటి రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టర్ సుధాకర్ జాషువా పురస్కారాన్ని అందుకున్నారు. జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తాను చేసిన కృషికి పురస్కారం లభించినట్లు డాక్టర్ సుధాకర్ తెలిపారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని మంగళవారం ఉదయం కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీకి చెందిన వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు, నట్టువ రాధాకృష్ణ, చెన్నకేశవరావు, కోటిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి కళ్యాణం జరిపారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం

- వినుకొండలో తీరనున్న దాహార్తి వెతలు
- అందుబాటులోకి రానున్న నూతన ట్యాంక్‌లు
- గాయత్రీ నగర్ వద్ద నూతనంగా మినీ, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం



నిర్మాణాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు



గాయత్రి నగర్ వద్ద నిర్మాణం పూర్తయిన మినీట్యాంక్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణ ప్రజలతో పాటు నూతనంగా నిర్మించిన కాలనీలు, శివారు కాలనీలకు కూడా తాగునీరు అందించేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. పట్టణంలోని గాయత్రీ నగర్‌తో పాటు రెడ్డినగర్, సంజయ్ గాంధీ నగర్, విష్ణుకుండి నగర్, బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న నాగిరెడ్డిపల్లికి కూడా తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. వినుకొండ తాగునీటి కోసం ఇటీవల రూ.153 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో పనులు చకచకా జరుగుతున్నాయి. గాయత్రీ నగర్‌లో స్టోరేజీ ట్యాంక్‌తో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

శరవేగంగా గాయత్రీ నగర్‌లో..

ఏఐఐబీ నిధులతో సింగరచెరువు అభివృద్ధితో పాటు గాయత్రీనగర్ వద్ద మినీ ట్యాంక్‌తో పాటు 11 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎస్ఎస్‌పీ కాలనీలో అదే తరహాలో మరో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు జరుగనున్నాయి. ఇప్పటికే దీనికి అనుసంధానంగా పట్టణం మొత్తం పైపులైన్ నిర్మాణం, తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. నూతన పైపులైన్ పూర్తయిన వెంటనే పట్టణ ప్రజలకు 24 గంటలు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

వేసవి కాలం వచ్చిందంటే వినుకొండ పట్టణంలో ఏ బజారులో చూసినా తాగునీటి కోసం మహిళలు మున్సిపల్ ట్యాంక్‌ల కోసం ఎదురు చూసే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. దశాబ్దాలుగా వినుకొండ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే మారిపోయింది. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఇచ్చిన హామీ మేరకు సమస్యను పరిష్కరించారు. వినుకొండకు తాగునీరు అందించే సింగరచెరువు గతంలో 60 ఎకరాలు మాత్రమే ఉంటే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని సేకరించి తాగునీటి చెరువును 270 ఎకరాలు చేశారు. దీంతో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీరిపోయింది.

అందుబాటులోకి వచ్చిన ఓవర్ హెడ్‌ట్యాంక్

పట్టణంలోని హనుమాన్ నగర్‌లో 11 లక్షల లీటర్ల సామర్థ్యంతో రూ.2.50 కోట్లతో భారీ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభం కావడంతో పూర్తిస్థాయిలో పరిష్కారం లభించింది. ఇకపై ప్రతిరోజూ పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.160 కోట్ల నిధులతో నిర్మించే తాగునీటి పనులకు సంబంధించి అభివృద్ధి పనులను త్వరలోనే చేపట్టనున్నారు.

సింగర చెరువు అభివృద్ధి చేశారు



వినుకొండ పట్టణం పుట్టినప్పటి నుంచి తాగునీటి సమస్యతో సతమతమవుతోంది. దశాబ్దాల కాలం నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ వినుకొండ ప్రజలకు మాత్రం తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సింగర చెరువును అభివృద్ధి చేశారు. తక్కువ ఖర్చుతో 270 ఎకరాల చెరువును అందుబాటులోకి తీసుకొచ్చి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చారు.

– సొనాల పుల్లయ్య, 16వ వార్డు కౌన్సిలర్

అహర్నిశలు కృషి చేస్తున్నాం



వినుకొండ ప్రజలకు తాగునీటి సౌకర్యం అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాం. పట్టణ ప్రజలతో పాటు శివారు కాలనీలకు కూడా తాగునీటి సౌకర్యం అందించేందుకు చర్యలు చేపట్టాం. పట్టణంలో సింగరచెరువు అభివృద్ధితో పాటు గాయత్రినగర్ వద్ద మినీ ట్యాంక్‌తో పాటు 11 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. అలాగే ఎస్ఎస్‌పీ కాలనీలో అదే తరహాలో మరో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాలు జరుగనున్నాయి. ఇప్పటికే దీనికి అనుసంధానంగా పట్టణం మొత్తం పైపులైన్ నిర్మాణం, తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. నూతన పైపులైన్ పూర్తయిన వెంటనే తాగునీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తాం.

–వెంకయ్య, కమిషనర్

ఘనంగా గణేష్ ఉత్సవాలు



వినుకొండలో హోమాలు చేస్తున్న దంపతులు



శావల్యాపురం నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ముదిరాజ్ యూత్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల వద్ద వేంచేసి ఉన్న స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఘనంగా గణపతి హోమాలు నిర్వహించారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో 21 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఉత్సవాలు ప్రారంభమైన తొమ్మిదవ రోజున లోక కల్యాణార్థం గణపతి హోమాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా 9 హోమ గుండముల వద్ద 36 మంది దంపతులచే గణపతి హోమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆలయ కమిటీ సభ్యులు పేరూరి శ్రీనివాసరావు, గుమ్మడి సదాశివరావు, పువ్వాడ సుబ్రహ్మణ్యం, పువ్వాడ అరవింద్, పాల్వాది చక్రధర్, కురిచేడు నాగేశ్వరరావు, విగ్రహదాత నరసింహారావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బోనాల సమర్పణ....

స్థానిక దక్షిణం బజారులోని శ్రీశ్రీ భద్రావతి సమేత భవనారుషి స్వామి దేవస్థానంలో ద్వితీయ గణేష్ మహోత్సవంలో భాగంగా 9వ రోజు గ్రామదేవతలకు, స్వామివార్లకు మహిళలు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్. పుష్పలత, గమిడి ఆంజనేయస్వామి భజన బృందం, మహిళలు, మార్కండేయ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక రైల్వేస్టేషను రహదారిలో వినాయక విగ్రహ నిమజ్జనం వేడుకలు ముదిరాజ్ యూత్ (బీసీ) సంఘం కమిటీ సభ్యులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి లడ్డూను గ్రామానికి చెందిన కొంగల మహాలక్ష్మయ్య రూ.27.500 రూపాయలకు కైవసం చేసుకున్నాడు. ముదిరాజ్ యూత్ సభ్యులు మద్దినేని హరిబాబు (సీఏ) తనవంతు సహాయంగా రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. నిమజ్జనం వేడుకల్లో డీజే మేళా తాళాలు కనకతప్పట్లు బాణాసంచా నడుమ విగ్రహాన్ని విద్యుత్ కాంతులతో యువకులు ఉత్సాహంగా ఉల్లాసంగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు.

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం



నరగాయపాలెంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కార్యదర్శి, ఎంఆర్‌సీ



ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్, అధికారులు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని నరగాయపాలెం గ్రామ పంచాయతీలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంఆర్‌సీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి ఎర్రయ్య పర్యటించి ఎస్‌డబ్ల్యూపీసీ సెట్ పరిశీలించారు. సైడ్ కాలువలో చెత్త తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకోవాలని, బహిరంగ మలవిసర్జన లేని గ్రామంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోట్లూరులో ర్యాలీ

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో మంగళవారం స్వచ్ఛతా హి భారత్ అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పోపూరి జ్యోతి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఆరుబయట మలవిసర్జన చేయటం వలన పలు రకాల అంటువ్యాధుల ప్రబలతాయన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మరుగుదొడ్లు వినియోగించాలన్నారు. అక్టోబరు 2వ తేదీ వరకు ర్యాలీలు, అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. అనంతరం ప్రధాన కూడలి మార్గంలో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శింగొట్టి అన్నపూర్ణమ్మ, ఈవోపీఆర్డీ పి.సుగుణ, మండల స్వచ్ఛతా భారత్ కో ఆర్డినేటరు గుండాల కోటేశ్వరరావు, అంగన్‌వాడీ, ఆరోగ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలివెళ్లిన గణనాథులు

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ, ఉప్పరపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని విఘ్నేశ్వరస్వామి విగ్రహాలను చవితి నిర్వాహక కమిటీ సభ్యులు నిమజ్జనానికి మంగళవారం తరలివెళ్లాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్స్ నడుమ గులామ్, పూలు చల్లుకుంటూ ఆనందోత్సవాలతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వీధుల్లో మహిళలు స్వామి వారి విగ్రహాన్ని దర్శించి పూజలు చేసి, వివిధ ప్రసాదాలను పంపిణీ చేశారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లా ఉపాధి పీడీ గంగవరపు జోసఫ్ కుమార్



కొత్తలూరులో ఎంపీపీ స్కూల్లో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జోసఫ్‌కుమార్

శావల్యాపురం: నీటి సంరక్షణలో భాగంగా భూగర్భ జలాలు పెంపుదలకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా నీటి యాజమాన్యం డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు, శావల్యాపురం గ్రామాల్లో చేపట్టిన రూఫ్ టాప్ వాటర్ ఆర్ వెస్టింగ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భవనాల సముదాయాల్లో వర్షపునీరు వృథాగా పోకుండా ప్రత్యేకంగా శ్లాబు మార్గంలో పైపులైను ఏర్పాటు చేసి నీటిని పొదుపు చేసే కార్యక్రమంలో భాగంగా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో వెల్దుర్తి, దుర్గి, వినుకొండ నియోజక వర్గంలోని ఐదు మండలాలు ఎంపిక చేశామన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఇలాంటి రూఫ్‌టాప్ వాటర్ ఆర్ వెస్టింగ్ నిర్మాణ పనులు వలన భూగర్భ జలాలు సమృద్ధిగా పెరుగుతాయన్నారు. ఒక్కొక్కటి నిర్మాణ పనుల నిమిత్తం రూ. 45 వేలు రూపాయలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. 10 అడుగుల లోతు కలిగిన గుంతను తీయటంతో పాటు 12 అడుగుల వెడల్పు, 10 అడుగుల పొడవు కల్గి ఉన్న గుంతలో అందులో సైజుల వారిగా కంకర రాళ్ళు, ఇసుక పోసి అనంతరం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనుల చేపట్టి శ్లాబుపై నుంచి వచ్చిన పైపును అందులో ఉండేలా చేస్తామన్నారు. అనంతరం మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, శావల్యాపురం, కొత్తలూరు గ్రామాల్లో జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పి.సీతారామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధి టీఏలు బేబిరోజా, శ్రీనివాస గుప్తా, ఫీల్డ్ అసిస్టెంట్స్ పోట్ల హనుమంతరావు, ముట్లూరి క్రాంతి పాల్గొన్నారు.

సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి

శావల్యాపురం: పాఠశాలల సముదాయ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా డీఈవో కార్యాలయం అకడమిక్ మోనిటరింగ్ అధికారి పులిపాటి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండలంలోని కారుమంచి, శావల్యాపురం కాంప్లెక్సు సమావేశాల నిర్వహణ తీరును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తి, ఉపాధ్యాయుల్లో బోధన శక్తి పెంపుదలకు ఈ సమావేశాలు దోహదపడతాయన్నారు. అలాగే ఉపాధ్యాయుల్లో నెలకొన్న సందేహాల నివృత్తితో పాటు సమస్యలు పరిష్కరించుకోవడానికి ఇలాంటి సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా మెరుగైన విద్యాబోధనతో పాటు ప్రభుత్వం విద్యార్థులకు అందించే వసతులు సౌకర్యాలు తదితర వాటిపై నిరంతరం సమీక్షలు నిర్వహించి ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్సు చైర్మన్లు బోడ్డపాటి విజయలక్ష్మి, సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలికా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగంగా ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియ



కారుచోల గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

యడ్లపాడు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం వేగంగా కొనసాగుతుంది. ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు ఇంటింటికీ తిరిగి వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి నమోదు చేసుకుంటున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి మందులు ఇస్తున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు సంబంధించిన టోకెన్లను పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ప్రయోజనాలు, వాటి సద్వినియోగంపై వివరించే కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే మండలం పరిధిలో 1144 గృహాలు వైద్య సిబ్బంది సందర్శించి 3948 మందిని సర్వే చేశారు. అలాగే 421 మందికి వైద్య శిబిరంలో చూపించుకునేందుకు టోకెన్లను అందజేసినట్లు ఎంపీడీవో వై.హనుమారెడ్డి, పీసీహెచ్ సీహెచ్‌వో తెలిపారు.

అంబేడ్కర్ కోనసీమలో పిడుగురాళ్ల వాసి హతం

పిడుగురాళ్ల: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట మండలం మదనపల్లిలో పిడుగురాళ్ల పట్టణానికి చెందిన కొమ్మూరి పరబ్రహ్మాచారి హత్యకు గురయ్యాడు. వివరాల ప్రకారం మందపల్లి శనీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన కొమ్మూరి పరబ్రహ్మాచారి అతని స్నేహితుడు గడ్డం నాగభూషణం వెళ్లారు. దర్శనం అనంతరం సోమవారం రాత్రి గ్రామంలో మద్యం సేవిస్తుండగా ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకోవటంతో నాగభూషణం మద్యం సీసాతో పొడవడంతో పరబ్రహ్మాచారి(41) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలో పరబ్రహ్మాచారి ఆర్ఎంపీగా వైద్య సేవలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా వీరిద్దరు స్నేహితులు కావడం గమనార్హం. కొన్ని కారణాల వలన గతంలో కూడా వీరి మధ్య వాగ్వాదం జరిగినట్లు బంధువులు తెలుపుతున్నారు. సఖ్యతగా ఉండి నమ్మించి శనీశ్వరస్వామి దర్శనానికి తీసుకొని వెళ్లి అక్కడ చంపి ఉంటాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడు పరబ్రహ్మాచారికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి వార్డు కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎంపీడీవో కార్యాలయ ఏవోగా రవి

ఈపూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా సీహెచ్ వెంకట రవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ఇదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ యువకుడు మృతి

నరసరావుపేట టౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు మంగళవారం తెలిపారు. ఈ నెల 18వ తేదీన పాతూరుకు చెందిన ఆవుల వెంకట శివసాయి (18) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తండ్రి ద్విచక్రవాహనం ఇప్పించలేదన్న క్షణికావేశంతో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి వీరాస్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాచవరంలో మహిళ..

మాచవరం: అనారోగ్య కారణంగా ఆత్మహత్యకు పాల్పడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన సపావత్ జ్యోతిబాయి (32) ఏడాది క్రితం ప్రమాదానికి గురికాగా, ప్రమాదంలో కాలికి బలమైన గాయాలయ్యాయి. ఆపరేషన్ అనంతరం కొంత కాలంగా కాళ్ల నొప్పులతో బాధపడుతూ ఉంది. కాళ్ల నొప్పులు భరించలేక ఈనెల 17న ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సమీర్ భాషా తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



మిరియాల గణేష్

నరసరావుపేట టౌన్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రబాబునాయుడు కాలనీకు చెందిన మిరియాల గణేష్ (12) పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి వినాయకుడి నిమజ్జన ఊరేగింపు తిలకించేందుకు కోట సెంటర్‌కు వచ్చాడు. అక్కడ వంగవీటి మోహన్‌రంగా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దిమ్మె ఎక్కి చూస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు కర్ర సహాయంతో బాలుడిని పక్కకు నెట్టారు. వెంటనే 108 సహాయంతో సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు మృతుడి తల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువతి దుర్మరణం

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



మృతి చెందిన అశ్విని

రొంపిచర్ల: వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పైన గల సిమెంట్ పోల్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న యువతి కిందపడి మృతి చెందిన ఘటన మండలంలో తుంగపాడు గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేటకు చెందిన ఓ ఈవెంట్స్‌లో అశ్విని (22), మున్నా అనే యువతీ యువకులు పని చేస్తున్నారు. సోమవారం రాత్రి డాన్స్ ఈవెంట్‌కు హాజరై రొంపిచర్ల మీదుగా నరసరావుపేటకు బైక్ మీద వస్తుండగా తుంగపాడు గ్రామ సమీపంలో గల బ్రిడ్జీ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి సిమెంట్ పోల్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో బైక్ కింద పడిపోవడంతో బైక్ నడుపుతున్న మున్నాకు తీవ్రగాయాలయ్యాయి. బైక్ వెనుక కూర్చున్న అశ్విని రోడ్డు ప్రక్కన గల కాలువలో పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నరసరావుపేట వైపు వెళ్తున్న వారు అక్కడ పడి ఉన్న వీరిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కాలువలో పడిన అశ్విని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అదే విధంగా తీవ్ర గాయాలైన మున్నాను చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా మృతురాలు అశ్విని తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. మున్నా నరసరావు పేటకు చెందిన వాడని పోలీసులు తెలిపారు. కాగా మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సి.హెచ్.సురేష్ బాబు తెలిపారు.

పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: జాతీయ ప్రతిభా అన్వేషణ పరీక్షలో (ఎన్ఎంఎంఎస్) భాగంగా ఈఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన పరీక్షలో ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ అక్టోబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని ఇన్‌చార్జ్ డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తమ మెరిట్ కార్డ్, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకాలలోని వివరాలను ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా సరిచూసుకొని పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి వివరాలను సంబంధిత పాఠశాల నోడల్ ఆఫీసర్ స్థాయిలో డిసెంబర్ 15వ తేదీలోగా పరిశీలించి లాగిన్ ద్వారా ధ్రువీకరించాలని తెలిపారు. విద్యార్థులు తమ పోర్టల్ అప్లికేషన్, వివరాలను ధ్రువీకరించే పత్రాలను డీఈఓ కార్యాలయంలో అందచేసి డిసెంబర్ 30వ తేదీలోగా జిల్లా నోడల్ అధికారి లాగిన్ ద్వారా తమ అప్లికేషన్‌ను ధ్రువీకరించుకోవాలని తెలిపారు. అలాగే, 2019 నవంబరు, 2021 ఫిబ్రవరి, మార్చి 2022 సంవత్సరాలలో ఎంపిక కాబడి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ స్కాలర్‌షిప్‌లను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు.